# సిరికీ లేమికీ మధ్య...

సంధ్య దీపం వెలిగించి వీధి గుమ్మానికి పసుపు కుంకుమ పెట్టడానికి ఇవతలికి వచ్చిన అనంతమ్మ స్తంభం పక్కగా ఎవరో నిలబడి ఉండడం చూసి "ఎవరది?" అని అడిగింది.

"నేను... నేను...." గొణిగినట్టుగా వచ్చింది సమాధానం.

వరండాలో బల్బ్ కాలిపోయి రెండు రోజులైంది. లైటులేదు. మునిమాపు వేళ కావడంవల్ల ఆకారాలు కనిపిస్తున్నాయి తప్ప ముఖాలు స్పష్టంగా కనిపించడం లేదు. అనంతమ్మ కుంకుమ పసుపున్న పంచపాళి అలా చేతిలో ఉంచుకొనే వాళ్లకు దగ్గరగా వచ్చింది.

ఒక ఆడమనిషి, ఒక యువకుడు నిలబడి ఉన్నారు. ఆమె చంకలో మూట, అతడి చేతిలో సంచీ ఉన్నాయి. 'ఎవరో చుట్టాలు దిగినట్టున్నారు రా, బాబూ! ఈ రాత్రి పచ్చికట్టెలతో వంట చేయాలి కాబోలు!' అనుకుంది విసుగ్గా.

"ఏ ఊరండీ?"

"నేను... నేను, వదినా! భారతిని!" డగ్గుత్తికతో అందామె.

హఠాత్తుగా విషసర్పాన్ని చూసినట్టుగా హడలిపోయింది అనంతమ్మ. కంపరంగా రెండడుగులు వెనక్కివేసి, "ఏ ముఖం పెట్టుకు వచ్చావు?" అంది చిటపటలాడిపోతూ.

"ఒక్కసారి మీ అందరినీ చూసి పోదామని!" దుఃఖం వచ్చేస్తోంది భారతికి.

"నేను చేసిన పనికి తలెత్తుకు తిరుగుతున్నారా లేదా అని చూసిపోవడానికి వచ్చావా?" విరుచుకుపడ్డట్టుగా అంది. "నువ్వు నీ తోవన వాణ్ణి తీసుకు లేచిపోయావు ఇక్కడ మా కొచ్చాయి తిప్పలు! అవమానంతో ఆత్మహత్య చేసుకునేంత పని అయింది.

ఆయన ఎక్కడ కొంపముంచి పోతాడో అని రాత్రింబవళ్ళు కావలి కాచాం! నువ్వాయన గుండెలో చేసిపోయిన గాయం ఇప్పుడిప్పుడే మానుతోంది అది రేపడానికి వచ్చావా?"

అనంతమ్మ గొంతు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ఈ గొడవకు ఇంట్లోంచి రంగాచారి వచ్చాడు. సంధ్యావందనం మధ్యలో ఆపేసి!

"ఏమిటి గొడవ?"

"ఎవరొచ్చారో చూడండి!"

"అన్నయ్యా!" ఆ పిలుపులో దుఃఖపు కెరటాలు విరుచుకు పడుతున్నాయి! కాటువేయడానికి పడగెత్తిన పామునుండి తప్పుకుంటున్నట్టుగా ఆయన చివ్వున నాలుగడుగులు వెనక్కి వేశాడు. "తక్షణం వెళ్ళిపో! నువ్వొచ్చినట్టు, బతికి వున్నట్టు ఎవరికీ తెలియకముందే వెళ్ళిపో!"

"ఎందుకన్నయ్యా, అంత నిర్దయ? నేను చేసిన తప్పు ముప్ఫయ్యేళ్ళ నాటిది! ఇంకా నేనంటే కోపం పోలేదా?"

"ముప్ఫయ్యేళ్ళనాడు నేను, నా వంశ మర్యాద మాత్రమే ఉండేవి! ఇవాళ పెళ్ళికెదిగిన ముగ్గురు కూతుళ్ళున్నారు. నా మీద దయుంచి వెళ్ళిపో!"

"వెళ్ళిపోతాను అన్నయ్యా! నేను వచ్చినట్టు ఎవరికి తెలియక ముందే వెళ్ళిపోతాను. కాని ఒకసారి పిల్లల్ని చూసిపోతాను! ఒకసారి నన్ను లోపలికి రానివ్వు! నీ ఇల్లు నా అడుగులతో మైలపడిందనుకొంటే పుణ్యావాచన చేసుకో నేను వెళ్ళిపోయాక!"

ఆ మాటలు సూటిగా గుండెలో గుచ్చుకోగా కొద్దిగా కరిగిపోయాడు రంగాచారి. "లోపలికిరా!" అని అనక తప్పలేదు.

లైటు వెలుతురులో భారతిని ఒక్క క్షణం చూశాడు రంగాచారి. నుదుట కుంకుమ, మెళ్ళో నల్లపూసలు తప్ప ఏ అలంకారాలు లేవు. చీర చాలా సాదాగా ఉంది. ముప్ఫయ్యేళ్ళ నాటి గతం అన్నా చెల్లెళ్ళ కళ్ళ ముందు కదిలినట్టుగా అయింది.

✧ ✧ ✧

సంవత్సరంపాటు భర్తతో కాపురం చేసిన భారతి తలచెడి పుట్టింటికి వచ్చేసింది. తమ దగ్గర వైదికం నేర్చుకొంటూ తమ ఇంట్లోనే ఉండేవాడు వరదాచారి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్న అనాథ! అతడితో భారతి చనువుగా ఉండడం చూసి

మందలించాలని అనుకొంటూండగానే భారతిని తను పెళ్ళిచేసుకోదలచినట్టు చెప్పాడు వరదాచారి.

రంగాచారి నిప్పులు కురిపించాడు. మళ్ళీ గడప తొక్కావంటే ప్రాణం తీస్తానంటూ మెడపట్టి బయటకు గెంటాడు.

"ఎందుకన్నయ్యా అంత కోపం సహృదయంతో నన్ను పెళ్ళాడతాననడం ఆయన తప్పా? నా వయసిప్పుడు పదహారేళ్ళు, నేను కోరికలు నిగ్రహించుకోలేక చీకటి చాటున తప్పుచేయడం కంటే మళ్ళీ పెళ్ళి చేసుకోవడం బాగుండదా?" అంది భారతి.

"ఎవరికి బాగు? దేనికి బాగు?" కొట్టినట్టుగా అడిగాడు.

"ఒకరిని పెళ్ళి చేసుకుని మర్యాదగా కాపురం చేయడం."

"పెళ్ళిమీద పెళ్ళి చేసుకోవడానికి శూద్రకులం కాదే నీది. ముండ మోసి మళ్ళీ పెళ్ళికూతురు కావడం మన సంప్రదాయానికి చాలాదూరం."

"వదిన చచ్చిపోతే నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోవా? ఒకే పత్ని ఒకే పెళ్ళి అని ఊరుకొంటావా?"

"నీ నోరుపడ. ఎంత మాట కూశావే నిండు ఇంట్లో నిలబడి. అప్రాచ్యపు ముండవి అప్రాచ్యపు మాటలు మాట్లాడుతున్నావు." భారతి జుట్టుపట్టి లాగి అందిన చోటల్లా కొట్టసాగింది అనంతమ్మ. "ఎంత సిగ్గువదిలితే మగవాళ్ళకు ఎదురుపడి కోరికలు నిగ్రహించుకోలేనని చెప్పాలి? కోరికలు నిగ్రహించుకోలేక పోతే ఉరెట్టుకు చావు భూమికి భారం తగ్గుతుంది."

"నువ్వు కొట్టు, చంపు. నేను నిజం నిర్భయంగా మాట్లాడతాను. నువ్వు చచ్చావే అనుకో అన్నయ్య నెల తిరక్కుండానే పెళ్ళికొడకు అవుతాడు. నా భర్త చస్తే నేను మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదేం? మగవాడికి ఒక నీతి, ఆడదానికి ఒక నీతి చెప్పే సంప్రదాయం ఏట్లో కలవనీ."

"దీనికి ఆ మంచంలో పడ్డదాని పోలికలు వచ్చాయి" తల పట్టుకొన్నాడు రంగాచారి.

ఆ మంచంలో పడ్డ మనిషి పక్క గదిలోనే ఉంది. ఈ గొడవంతా వింటూ ఉంది. ఆవిడ ఎవరో కాదు. రంగాచారికి, భారతికి మేనత్త, మీనాక్షమ్మ. పక్షవాతంతో

ఆవిడకి ఓ కాలు చేయి పోయినా తెలివి సలక్షణంగానే ఉంది. భారతిని పిలిచి తన పక్కన కూర్చోపెట్టుకుని అంది... "నా పోలిక నీకు ఎప్పటికి రాకూడదే భారతీ. ఈ సాంప్రదాయపు సంకెళ్ళు తెంచుకో! ఇంట్లోంచి వెళ్ళిపోయి వరదుణ్ణి పెళ్ళి చేసుకో.. పిల్లల్ని కను! నీ జీవితానికో అర్థం కల్పించుకో" అంది. "నీకు పదహారో యేట భర్త పోతే నాకు ఎనిమిదేళ్ళకే పోయాడు. నీలాగా నాకు ధైర్యం లేదప్పుడు మొదటిసారి కడుపు వచ్చినప్పుడు మీ అమ్మ నాన్న చచ్చిపొమ్మన్నారు! చావంటే భయం నాకు! ఆ ముదనష్టపు జీవితం మీద వల్లమాలిన తీపి. చావలేకపోయాను. అప్పట్లో సంసారం బాగా నడిచేది కాదు! నేను అడపాదడప పదులు వందలు ఇవ్వసాగాను. వాళ్ళనోటికి తాళం పడినట్టుగా అయింది. నాకు నెల తప్పినప్పుడల్లా ఓపిగ్గా మందులు పోయించే వాళ్ళు! మీనాన్న గొప్పపండితుడు! వేళ తప్పకుండా జపతప అనుష్టానాలు చేసేవాడు! మీ అమ్మసరేసరి! ఎప్పుడూ చన్నీటి స్నానాలు తులసిపూజలూ కానీ, ఈ ఇంట్లో ఎన్ని శిశుహత్యలు! లోపలింట ఏం జరిగినా ఫర్వాలేదు! పిండంపడి పోయినప్పుడల్లా నాకు పునర్జన్మ పొందినట్టుగా ఉండేది. ఒక్కసారి నెలలు మోసి ప్రతిరూపాన్ని చూచుకోవాలని ఎంతకోరిక ఉండేదో ఏదీ ఆ స్వేచ్ఛ? పాపిష్ఠి సంఘం! పాడు సంప్రదాయాలు! మనిషి జీవితం నరకం చేయడానికే ఇవి పుట్టాయా అనుకుంటాను?"

"ఒక్కసారి నెలలు మోసినా ప్రతిరూపాన్ని చూచుకోవాలని నా కెంత కోరికో?"

విధవకైనా సధవకైనా కనీసపు కోరిక కదూ? ఆ కోరికనుండి వంచితులైన ఆడవాళ్ళను ఈ సంఘం దయగా చూడదెందుకు?

ముసలావిడ కాస్త ఒత్తిగిల్లి తలగడలోంచి నోట్లకట్ట తీసింది. "ఇదిగో! ఇవి వెయ్యి ఉన్నాయి. అయిదు వందలు నీకిస్తాను! మిగిలిన అయిదు వందలు ఈ పాపిష్ఠి కట్టె కాల్చడానికి ఇస్తాను! ఈ అయిదువందలు తీసుకొని వరదుడితో వెళ్ళిపో!"

"ఆశీర్వదించు అత్తా!

"దీర్ఘ సుమంగళీభవ!". ఆవిడ చెయ్యి భారతి తలమీద ఆన్చింది "కడుపునిండా పిల్లల్ని కను? అష్టఐశ్వర్యాలలో తులతూగు!"

✧ ✧ ✧

ఆనాటి అత్త ఆశీర్వాదం చెవిలో గింగిరుమన్నట్టు కాగా భారతి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి! అప్పటికి రంగాచారి సంతానమంతా గదిలో గుమిగూడి

భారతిని ఏబ్రాసి ముఖం పెట్టుకు నిలబడిన ఆమె కొడుకునూ వింత మృగాల్ని చూసినట్టుగా చూడసాగారు.

రంగాచారి సగంలో ఆపిన సంధ్యావందనం పూర్తిచేయసాగాడు. కాని ఆయన మనసు నిలకడగా లేదని తెలుస్తూనే ఉంది.

ఒకమ్మాయి భుజంమీద చేయివేసి, "ఏమ్మా? ఏం పేరు?" అడిగింది భారతి అపేక్షగా.

"పద్మ"

పద్మ పక్కన నిలబడిన పిల్ల కొంచెం గడుగ్గాయిలా ఉంది. అందరిలో ఆ పిల్లే కాస్త చక్కదనంగా ఉంది కూడా. "నీ కొడుకా?" ఆ అడగడంలోనే అదో వెటకారం!

"అవునమ్మా నీ పేరేమిటి?"

"మంజుల, ఏం చేస్తాడు ఆయన?"

"హో.... హో.... హోటల్లోప్పిప్పిప్పిండి... రుబ్బుతాను" సమాధానం ఏబ్రాసి ముఖం నుండి వచ్చింది.

గది నవ్వులతో ప్రతి ధ్వనించింది.

"మీ నాన్న దోశెలు పోస్తాడా?"

తల ఊపాడు.

మళ్ళీ నవ్వులు

తెల తెలవారుతూంది.

నూతిమీద నీళ్ళు తోడుకొంటున్న గంగాభాగీరథీ సమానురాలైన త్రిపురమ్మ, ఆ చీకటినే వెళ్ళిపోతున్న భారతినీ ఆమె కొడుకునీ చూసి, "ఆ వెళ్ళేది ఎవరు అనంతా?" అని అడిగింది.

"ఎవరో గుర్తు పట్టావా?"

"నాకు పగలే చూపు సరిగ ఆనదు కదా?"

అనంతమ్మకి ఎక్కడలేని కడుపు వుబ్బరంగా ఉంది. పోతే త్రిపురమ్మతో "చూశావా, పిన్నీ" అంటూ ప్రతి చిన్న విషయం చెప్పుకొనే అలవాటు. ముప్పై

సంవత్సరాల క్రితం లేచిపోయిన ఆడబిడ్డ ఇన్నాళ్ళకి తన కొడుకుని వెంట బెట్టుకొని తమని చూడటానికి వచ్చిందన్న విషయం చెప్పకుండ ఉండలేకపోయింది!

"మొగుడు హోటల్లో దోశలు పోస్తాడట. కొడుకు పిండి రుబ్బుతాడట. వాడికి ఎంత నత్తి అనుకొన్నావు?" అంటూ రాత్రి విషయాలన్నీ చెప్పసాగింది. "దాని ఒంటిమీద చిన్న మెత్తు బంగారం లేదు. ఎంత దరిద్రంగా ఉందనుకొన్నావు మనిషి? సమాజమూ. కట్టుబాట్లూ. సంప్రదాయమూ వదిలేసిన వాళ్ళకి యశస్సు ఉంటుందా? నాశనమైపోతారు!" శపిస్తున్నట్టుగా చేతులు తిప్పి "నీ దగ్గర నేను ఏ మాటాదాచలేను. నువ్వు మాత్రం ఎక్కడ అనకేం?" అంది.

"నేను ఎప్పుడైనా అలా చెప్పానా? కాస్త ముందు నా చెవిన ఈ మాట వేస్తే భారతిని పలకరించేదాన్ని కదా? పనిలో పనిగా మీ అన్నయ్యకి ఎంత తలవంపులు తెచ్చి ఏం బావుకొన్నావని ఝూడించేదాన్ని!" మంచి ఛాన్స్ పోయినట్టుగా ఉందామెకు.

రెండు రోజుల తరువాత

గుళ్ళోపూజ ముగించి ఇంటికి వస్తున్నాడు రంగాచారి. గుడి మెట్ల మీది అతన్ని అడ్డగించాడు, పండరినాథ్ అనే ఆయన స్నేహితుడు "ఈ అద్భుతం విన్నావా?" అంటూ.

"ఏమిటి?"

"మీ చెల్లెలు ఈ ఊరికి వచ్చిందట."

రంగాచారి ముఖం నల్లబడింది. భగవంతుడా! నా ముఖాన ఏం అవమానం రాసి పెట్టావు!"

"ఊరికే రాలేదు! ఒక డాక్టరుకి తల్లిగా తిరిగి వచ్చింది... ఆమె కొడుకు కిరణ్‌కుమార్ మన ఊరి హాస్పిటల్‌కు టి.బి. స్పెషలిస్టుగా వచ్చాడు. మీ ఇంట్లో ఉండి మంత్రాలు నేర్చుకొంటున్న వరదుడు ఎంత గొప్పవాడైపోయాడను కొన్నారు? అతడి బిజినెస్సు. కంట్రాక్టులు లక్షలమీదే నడుస్తుంటాయట. ఈ రోజు ఆయన కారులోంచి దిగుతూ, "పండరినాథ్‌గారూ బాగున్నారా?" అంటూ పలకరిస్తే నేను గుర్తే పట్టలేదనుకోండి! "మా అబ్బాయి కిరణ్ ఈ ఊరికి డాక్టరుగా వచ్చాడు. అందుకని రావలసి వచ్చింది అన్నాడు."

"ఆఁ" రంగాచారి నిలబడలేనట్టుగా మెట్లమీద కూలబడిపోయాడు. "భారతి ఎందుకలా అబద్ధం చెప్పి పోయింది?" ఆయనకి చెప్పలేని ఆశ్చర్యంగా ఉంది.

"పెద్దబ్బాయి అతడి భార్య ఫారిన్‌లో రీసెర్చ్ చేస్తున్నారట. ఇద్దరు కూతుళ్ళకి గొప్ప సంబంధాలు చేశాడట. ఇప్పుడు మిగిలింది ఈ అబ్బాయి! డాక్టరు. కావలసిన వాడు ఆడ పిల్లలున్న వాడివి ఈ ఛాన్స్ మాత్రం పోగొట్టుకోక ..."

✧ ✧ ✧

చిన్నగా ఉన్నా అందంగా నీట్‌గా ఉన్న ఇల్లు అది!

కిటికీ దగ్గర కుర్చీలో కూర్చొని బయట తోటలోకి చూస్తూంది భారతి.

గదిలోకి వచ్చిన కిరణ్, "ఏం ఇంకా నీ పుట్టింటి వాళ్ళమీద బెంగా... మొన్నేగా కళ్ళారా చూసి వచ్చావు. పేరు పేరునా ఒక్కో మేనకోడలినీ, అల్లుడినీ పిలిచి వాళ్ళ చదువులు అభిరుచులు తెలుసుకున్నావు! ఇంకా ఏవైనా తెలుసుకోవాల్సింది వుందా? నేను కనుక్కొచ్చి చెబుతాను!" అన్నాడు తల్లిని దెప్పుతున్నట్టుగా.

"నేను జీవితంలో కనుక్కోవల్సింది ఒక్కటేరా! దరిద్రానికి, ఐశ్వర్యానికి మధ్య మనిషి ఎట్లా ప్రవర్తిస్తాడూ.... 'ఓ డాక్టరుగారి తల్లి అంటే మా...... అమ్మాయివేనా? ఆ రోజు అట్లాధైర్యం చేయబట్టి ఇవాళ ఇంత ఉన్నతికి చేరుకున్నావు! లేకపోతే మీ వదిన పిల్లలకి చాకిరీచేస్తూ వంటింటిపాలయేది కదా బతుకంతా?" అంటూ మెచ్చుకోలు. మర్యాద, వినయం ఒలకబోసే వీళ్ళు నిజంగా మీ నాన్న దోసె పోసే పనిచేస్తుంటే ఏమనేవాళ్ళు? ఆ రోజు మీ ఇంట్లో మంత్రాలు నేర్చుకుంటున్న వరదుడితో లేచిపోయిన భారతివి కదూ?" అని ముఖంమీదనే అనేవాళ్ళు. "ముప్పైయేళ్ళనాడు నేను, నా వంశమర్యాద మాత్రమే వుండేవి! ఇవాళ పెళ్ళికెదిగిన ముగ్గురు కూతుళ్ళు కూడా వున్నారు అన్న అన్నయ్య ఆ కూతుళ్ళ కోసమైనా నా గడపతొక్కడా ఒకనాడు?"

"అలా నీ గడప తొక్కిన రోజు అతనికి తగిన మర్యాద చేసే ఛాన్స్ మాత్రం నువ్వు నాకివ్వాలి. ఆ రోజు నువ్వు చెప్పినట్లు నీ వెంట నేను రాలేదూ? ఆ పిల్లల వెటకారాలూ. నవ్వులూ, తలుచుకుంటే ఒళ్ళంతా తేళ్ళు జెర్రులూ పాకినట్టుగా వుంటుంది నాకు."

"మంజు బాగుంది కదూ?"

"ఏడిసింది! అందంగా వుంటే సరా? ఎంత గర్వం వుంది దానికి? ఎంత వెటకారం చేసింది నన్ను?"

"ప్పి... ప్పి...ప్పిండి రు.... రు... రుబ్బుతాను అంటే నవ్వరా? ఆ రోజు నీ పోర్షన్ తలచుకుంటే నాకే పొట్టచెక్కలయ్యేలా నవ్వొస్తుంది!" నవ్వసాగింది భారతి. నవ్వుతూనే భర్త ఒకనాడు నిజంగా పిండిరుబ్బడం గుర్తు చేసుకొంది. బతుక్కి నీడ సంపాదించు కోవడమే కాదు, కష్టపడి తమ జీవితానికి ఒక గుర్తింపు తెచ్చుకోవాలని! అత్త ఇచ్చిన డబ్బులో ఒక్క పైసా వృధా చేయదలచుకోలేదు.

భారతి వరదాచారి పెళ్ళి చేసుకొని కాపురం పెట్టిన మొదట్లో "ఇడ్లీ ఇడ్లీ! ఒడా ఒడా" అంటూ వీధుల్లో తిరిగి అమ్మేవాడు వరదాచారి. ఏడాది తిరిగేప్పటికి భారతి ప్రోత్సాహంతో భారతి మేనత్త పేరుమీద 'మీనాక్షి విలాస్' కాంటీన్ తెరిచాడు. కాంటిన్ హోటల్ కావడానికి, హోటల్ సిటీకెల్లా ప్రసిద్ధి పొందడానికి ఎంతో కాలం పట్టలేదు.

అప్పటికే భారతికి ఇద్దరు మగపిల్లలు కలిగారు. చక్కగా చదువుకొంటున్నారు. మూడుపువ్వులు ఆరుకాయలన్నట్టుగా వుంది సంసారం. వరదాచారి దృష్టి కొన్ని కంపెనీలకు డీలర్‌షిప్ తీసుకోవడంలోనూ కంట్రాక్టులమీదపడింది. అందులో అనుకొన్నదానికంటే ఎక్కువ రాసాగింది. వాళ్ళు చేసే ప్రతిపనిలోనూ లక్ష్మీదేవి తన పరిపూర్ణ కటాక్షం చూపసాగింది.

"భారతీ! ఇదంతా నీ అదృష్టం" అంటాడు వరదాచారి. అతడికి భారతి ప్రాణాధికం. పిల్లలు పంచప్రాణాలు. తన సుఖ సంసారం చూచుకున్నప్పుడల్లా అత్త ఆశీర్వాదం గుర్తువస్తూంటూంది భారతికి. కాని, ఒకే ఒక్క చింత పీడిస్తుంది భారతిని! ఈ ప్రపంచంలో ఏ ఆడదానికైనా పుట్టిల్లూ మెట్టినిల్లూ వుంటుంది. తన దురదృష్టం పుట్టిల్లు ఉండీ లేనిదైంది ఎప్పటికైనా పుట్టింటితో సంబంధం కలుపుకోవాలంటే తన చిన్న కొడుకే ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. కిరణ్‌కి ఈ ఊరికి డాక్టరుగా అపాయింట్ కావడానికి భర్తచేత ప్రయత్నాలు చేయించింది.

భారతి హోదా గురించి, ఆమె సుఖ సంసారం గురించి వార్తలు మోసుక వచ్చేవాళ్ళకు కొరత లేకపోవడంతో, ఒక్కసారి ఆమె వైభవాన్ని కళ్ళారా చూసిరావాలని ఎంతగానో అనిపించ సాగింది అనంతమ్మకు. చూసి ఆనందించడానికి కాదు స్త్రీ సహజమైన కౌతుకం! కాని ఏం ముఖం పెట్టుకు వెడుతుంది? ఆ రోజు ఇంటికి వచ్చినదాన్ని అంతగా అవమానించారే! ఆ రోజు లక్ష్మి తమింటికి నడిచి వచ్చిందని తెలియక గుడ్డిగా ఆమెను అవమానించారు.

"ఎంత శ్రీమంతం కలిగినా గర్వం మాత్రం రాలేదు భారతికి. ఈ రోజు ఆల్బమ్ చూపెట్టింది! కూతుళ్ళు ఎంత అందంగా వున్నారనుకున్నావు? అబ్బా! ఎక్కడ చూసినా పిల్లలతో భర్తతో దిగిన ఫోటోలు! వాళ్ళు కొత్తగా కట్టుకొన్న ఇంట్లో గృహప్రవేశం అయినప్పుడు బిల్డింగ్ ముందు నిలబడి తీయించుకున్న ఫోటో చూడాలి! సినిమాల్లో మనం చూసే శ్రీమంతుల ఇళ్ళు అలాగే వుంటాయి!" పక్కింటి త్రిపురమ్మ ఊరిస్తోంది. "అనంతా! ఆడపిల్లలున్నదానివి! నువ్వు అభిమానం పెట్టుక కూర్చుంటే లాభంలేదు. నీకు మొహమాటంగావుంటే ఏదో ఒక సాకుతో నేను తీసుకువెడుతాను రా! అప్పుడే ఆ కుర్రాడి మీద ఊళ్ళో శ్రీమంతుల కళ్ళన్నీ పడ్డాయి"...

"వద్దు పిన్నీ! ఆయనికి తెలిస్తే కోప్పడతారు. అయినా అంత గొప్పవాళ్ళు మనపిల్లని ఎందుకు చేసుకుంటారు?"

"నువ్వలా అనుకుంటావేమో గాని, భారతికి మీరంటే చాలా ప్రేమ. మాటల సందర్భంలో 'అన్నయ్య స్థితి అంతంతే! పాపం! నలుగురాడపిల్లల పెళ్ళిళ్ళు ఎలా చేస్తాడో' అంది."

"నిజంగా అందా?" అబ్బురంగా అడిగింది అనంతమ్మ.

"అబద్ధం చెప్పటానికి నాకేమిటి అవసరం?"

అప్పటినుండి అనంతమ్మకు ఏ పని చేస్తున్నా అదే ధ్యాసైపోయింది. 'ఒకసారి అభిమానం పక్కకు పెట్టి వెళ్ళివస్తే దారి అదే పడుతుంది' అనుకొంది.

చివరికి ఒకరోజు తెగించి ఏమైతే అది అవుతుందని త్రిపురమ్మను వెంటబెట్టుకొని వెళ్ళింది అనంతమ్మ.

అద్దె ఇల్లే అయినా ఎంతో ముచ్చటగా వుంది ఇల్లు. ఇంటిముందు క్రోటన్ మొక్కలు తీరుగా అమర్చబడి వున్నాయి. గుమ్మాలకీ కిటికీలకీ వేసిన కర్టెన్లు డ్రాయింగురూంలో వేసిన ఫోటోలు గోడలకి, గదిమూలలకి వున్న అలంకార వస్తువులు – అన్నీ గొప్పగా కనిపించాయి. ఈ ఇంటి కోడలిగా తన కూతుళ్ళలో ఒకదాన్ని ఊహించుకొంటూంటే ఆవిడకి ఒళ్ళు గగురుపొడిచినట్టుగా అయింది.

భారతి వదిన రాకకి ఏమీ ఆశ్చర్యపడినట్టులేదు. ఆదరపూర్వకంగా ఆహ్వానించింది. "రా వదినా! ఒక్కదానివి రాకపోతే పిల్లల్ని వెంటబెట్టుక రాకూడదూ?" అంది ఎంతో ప్రేమగా.

అనంతమ్మకి మాట దొర్లడం కష్టంగా వుంది. "ఆ రోజు మా ప్రవర్తనకి క్షమించు భారతీ!" అంది అతి కష్టం మీద.

"నేనేమీ మనసులో పెట్టుకోలేదు వదినా! పోనివ్వు ఆ సంగతి!"

భారతి మీదినుండి చూపు మరల్చుకోవడం కష్టంగా వుంది అనంతమ్మకు. చెవులకు ముత్యపుదుద్దులు, మెడలో పుస్తెలతాడు, ముత్యాలతో చుట్టిన నెక్లెస్, చేతులకి రెండేసి బంగారు గాజులు. కట్టుకొన్న గులాబిరంగు వెంకటగిరి చీర, ఈ మాత్రానికే 'అదృష్టమంటే నీదే భారతీ' అనిపించేలా కనిపించింది.

తన పిల్లల చదువుల గురించి, పెళ్ళిళ్ళ గురించి సంసారం గురించి చాలా చాలా అడిగింది. అనంతమ్మ జీవితంలో ఎక్కడ పొందని ఆతిథ్యం పొందింది.

"ఇక వస్తాను భారతీ!" అని సెలవు తీసుకొంటూంటే, "నేను ఇల్లు వదిలి వచ్చేశాక నా యింటికి వచ్చిన మొదటి బంధువువి నువ్వే వదినా!" అంటూ చీరా జాకెట్ గుడ్డ కుంకుమ పెట్టి ఇచ్చింది భారతి.

ఊహించని ఆ మర్యాదలకి ఉక్కిరి బిక్కిరి అయింది అనంతమ్మ. ముప్పైయేళ్ళ తరువాత తమింటికి వచ్చిన ఆడబిడ్డ ఆ రాత్రి అభోజనంగా పడుకుంటే తను భోజనానికి లెమ్మని కూడా అనలేదు. 'ఆ భ్రష్టురాలికి ఆకువేసి అన్నం వడ్డించడం కూడానా?' అన్నట్టు ఊరుకుంది.

"నువ్వు ఆనాటిది నిజంగా మనసులో పెట్టుకోకపోతే ఇంటికిరా, భారతీ!"

"ఊహుఁ. ఆ రోజు అన్నయ్య ఎంత మాట అన్నాడు. నువ్వు వచ్చినట్టు బతికున్నట్టు ఎవరికీ తెలియకముందే వెళ్ళిపో అన్నాడు. అంతమాటపడి, అన్నయ్య నా ఇంటికివచ్చి పిలవకుండానే నేను ఎలా వస్తాను వదినా?"

"ఆనాటి పరిస్థితులు వేరుగా?" గొణిగినట్టుగా అంది.

"నిజమే వదినా! నేను కారులో వచ్చి దర్జాగా మీ ఇంటిముందు దిగి వుంటే నన్ను అన్నేసి మాటలు అనేవాళ్ళు కారు! అసలు ముప్పైయేళ్ళనాటి సంగతే గుర్తు చేసేవాళ్ళు కారు. సిరికీ, లేమికి మధ్య బంధువైనా ఎలా ప్రవర్తిస్తాడన్నది తెలుసుకోవాలనే ఆ రోజు వచ్చాను. లేమి రక్తపాశాన్ని తెంపుతుంది. లేమి మనిషిని ముష్టివాడుగా చూపిస్తుంది. సిరికీ లేమికీ మధ్య విలువలు ఎంత తమాషాగా మారిపోతాయి? డబ్బుంటె చాలు పాత సంప్రదాయాలు కూల్చి కొత్త సంప్రదాయాలు సృష్టించుకోవచ్చు.

డబ్బుతో ఏ మచ్చ అయినా మాన్చుకోవచ్చు! వంశమర్యాద కొనవచ్చు. అసలు మనుషుల్నే కొనవచ్చు, వదినా!"

"అదో! ఏమీ మనసులో పెట్టుకోలేదంటూనే దెప్పుతున్నావు."

"మాట వచ్చింది కాబట్టి అన్నాను. ఒకసారి పద్మనీ, మంజునీ రమ్మను!"

ఈ మాటతో ఆశ లేచి వచ్చింది అనంతమ్మకు.

భారతి ఇంటికి వెళ్ళి కళ్ళారా ఆమె దర్జా, వైభవాన్ని చూసి వచ్చాక అనంతమ్మ ఇక ఊరుకోలేక పోయింది. "మీరు వెళ్ళి పిలిస్తే వస్తానంది మీ చెల్లెలు. ఒకసారి వెళ్ళి రండి."

"ఏ ముఖం పెట్టుకు వెళ్ళాలి?"

"ముప్ఫయ్యేళ్ళనాటి భారతి తప్పే మాసిపోగా మీరన్న మాటలే మాసిపోవా?"

"భారతి తప్పు డబ్బుతో మాసిపోయింది. మీ మాటల్ని రక్తపాశం మరిపిస్తుంది."

ఇంట్లో భార్య సమర్థింపు ఇలా ఉంటే ఊళ్ళో శ్రేయోభిలాషుల హితోక్తులు మరో విధంగా ఉన్నాయి! "పరిస్థితులనుబట్టి అవసరాలనుబట్టి మనిషి మారకపోతే లాభంలేదు. రంగాచారీ ఆడపిల్లలున్న వాడివి! నువ్వు అభిమానం పెట్టుకు కూర్చుంటే ఎలా? నువ్వు తాత్సారం చేస్తూ కూర్చొన్నావంటే బంగారం లాంటి కుర్రాడిని ఎవరో ఎగరేసుకు పోతారు."

రంగాచారిలో ఊగిసలాట ఒకనాడు ఆగిపోయి చెల్లెలింటికి బయల్దేరాడు.

తరువాత.

పెళ్ళికెదిగిన తన ముగ్గురు కూతుళ్ళలో ఒకదాన్ని కిరణ్‌కి చేసుకొమ్మని రంగాచారి అడిగాడా. కిరణ్ ఆ ఛాన్సు ఎలా ఉపయోగించు కొన్నాడు. అనేది పాఠకుల ఊహకి వదిలేస్తున్నాను! సిరికీ లేమికీ మధ్య మనిషి ఎలా ప్రవర్తిస్తాడన్నదే నేను చెప్పదలుచుకొన్నది చెప్పాననుకొంటున్నాను.

*మహిళ మాసపత్రిక, దీపావళి 1979*

◆